పెద్దకథ

# రత్నగర్భ

"వనశ్రీ"

తూరుపు పొలెంనుంచి వస్తోన్న రామిరెడ్డి కుడికాలు గట్టుమీద పట్టుతప్పి పక్కకు జారింది. మాగాటి గట్టుమీద చేతులానించి బలువుగా చేలోకి వాలిపోయాడు రామిరెడ్డి. బలువుగా వంగిన రామిరెడ్డి వెన్నెముకలో బాధ కలిగి నీరసంగా మూలిగాడు. తన కాళ్ళకింద భూమి తన్ను మోసం చేసినట్టుంది. అవును ఆ భూమి తన్ను మోసం చేసింది. తన కాళ్ళకు ఆ మాగాటి రేగడి మట్టిలో నడవడం అలవాటులేదు. నలభై సంవత్సరాలగా గట్టి నేలమీద నడిచిన రామిరెడ్డికి ఆ జారుడు నేలమీద నడక ఎలా సాగుతుంది?

అస్తమించుతూన్న సూర్యుని అరుణకాంతులు బంగారు వన్నెల వరిచేలపై వాలిపోతున్నాయి. పైరుగాలి అలల తెరలకు బంగారువన్నె లీనుతూ వరికంకులు బలువుగా సోలిపోతున్నాయి. నీలిరంగుల నిర్మలాకాశంలో తెల్లటి మబ్బులు అల్లిబిల్లిగా పరుగులు తీస్తున్నాయి. నీలి పిట్టల కలకలలూ, బారులుతీరి గూటికి చేరుతున్న తెల్లటి కొంగలూ, ఏటిలో తెరచాపలెత్తుకొనిపోతూన్న పడవలూ, పంటకాలవ మలుపులలో జ ల జ లా; మాపులమీదగా దూకుతోన్న చేపల తళుకుబెళుకులూ, పచ్చిగడ్డిలోంచి నెట్టుకుని వస్తోన్న నత్త గుల్లలకంపూ, యీ వాలిపోయిన పంటచేలపైనుంచి వస్తోన్న తియ్యటి గాలి తెరలూ రామిరెడ్డి శరీరాన్ని తాకినా, హృదయాన్ని కదిలించలేకపోతున్నయ్.

మోకాలిపై ఎడంచేయి ఆనించుకొని, గట్టుపై కుడిచేతినినొక్కిపట్టి నీరసంగా లేచి నుంచున్నాడు రెడ్డి. ముందుకు అడుగెయ్యబోయిన రామిరెడ్డిని, గసెంమీద ఎదురుగా బారెడెత్తున పడగవిప్పి నుంచొన్న నాగుపాము నిలేసింది! పామును చూసి రామిరెడ్డి కొయ్యబారిపోయి, శిలలా నిలబడిపోయాడు. కదిలిమెదలని రెడ్డినిచూసి త్రాచు పక్కకు తిరిగి కలుగులోకి వెళ్ళిపోయింది. పాము వెళ్ళినవైపే చూస్తూ నుదుటపట్టిన చెమటను తలపంచతో తుడుచుకొన్నాడు.

గండం తప్పిందన్న సంతోషం రామిరెడ్డికి ఏకోశానా గలగలేదు. నాగేంద్రుడు కాటందుకొన్నా తన హృదయంలో రగులుకుపోతూన్న కొలిమి చల్లారేది. తనపై క్రూరసర్పానిక్కూడా జాలి గలగలేదేమో? ఎంతకాలం పరులపంచలో వుండిగం? ఎన్నాళ్లు యీ కానిదేశంలో బానిసత్వం? ఎన్నిరోజులు జీవచ్ఛవంలా బతకడం? జీవిత ఆశలన్నీ అడుగంటిపోయినై. బతికిందే బతుకు, గతంలోనే తీపి, మిగిలిందంతా చేదూ, నరకం. ఇక యీ జీవితానికి శాంతిలేదు. ఆ చల్లటి మృత్యుదేవత వడిలోనే శాంతి, హాయి.

తను నడుస్తూన్న నేల తనదికాదు. ఈదేశం తనదికాదు. ఈభూములు తనవికావు. ఈపంటచేలు తనవికావు. బరువుగా వంగినవరికంకులుతనవికావు. పంట కాలవనీళ్లు తనవికావు. పండి వరిగిన వరిపైరు తనదికాదు. కోసివేసి వోదెలు తనవికావు. కట్టివేసిన వరి కుప్పలు తనవికావు. జనపవిత్తుల్లోంచి బయటికొస్తూన్న లేత మొక్కలు తనవికావు. అల్లుకుపోతోన్న పెసరతీగలు తనవికావు.

ఈ ఆ సిరి, ఆసంపద, ఆజీవితం, ఆనేల, ఆగాలి, ఆనీరు, అవేవీ తనవికావు. తను తనవాడు. తనలోని రామిరెడ్డి ఇప్పుడులేడు; వుంటే ఇంకా బతికుండడు, బతికినా ఇలాంటి బతుకుబతకలేడు.

రామిరెడ్డి తల్లో వుప్పెన కెరటాల్లా ఆలోచనలు సాగిపోతోన్నాయి. శరీరంలో రక్తం వేగంగా ప్రవహిస్తోంది. నరాలు పైకి వుబికాయి. వెన్నెముకలో బాధ, గుండెల్లో మంట, కనిగుంటల్లో నీళ్లు. ఎడతెగని వూహాలు, దారీ తెన్నూలేని ఆలోచనా, ఒకటే ఆలోచన.

గతాన్ని తవ్వుకొని ఆనందిస్తున్నాడు. ఏడుస్తున్నాడు. తిరిగి తిరిగి గతంలోకే పోతోన్నయ్

రెడ్డి ఆలోచనలు—తన దేశం, తనవూరూ, తన పొలాలు, తనపంటలూ, తనగొడ్లూ, తనయిల్లూ, తనవాళ్లు——

పశ్చిమ దిక్కంతా రాగకాంతితో స్నిగ్ధమై పోతోంది. కొండలూ, వాగులూ, చెట్లూ, పొలాలు ఎర్రటి కుంకుమవర్ణాన్ని పూసుకొంటూన్నయ్. సూర్యుడు కొండలచాటున చేలల్లోకి పోతున్నాడు. రామిరెడ్డి ఫాలభాగంపై స్వేదబిందువులు యింద్రధనుసుల్ని కల్పించుతున్నాయి. పచ్చటి చేలల్లోకిదిగిపోతూన్న రామిరెడ్డికి ఆశలుకల్పించి జాలిగా పిలుస్తోన్నట్టుంది తనతోరమ్మని——తను పుట్టి పెరిగిన పురిటిగడ్డకు, పోతుగడ్డకు- జన్మభూమి రత్నగర్భకు.

*   *   *

రామిరెడ్డి రాయలేలిన రత్నాలసీమలో పుట్టాడు, అక్కడే పెరిగాడు. రామిరెడ్డి తాత ముత్తాతలు కూడా ఆ గడ్డమీదే పుట్టి పెరిగి, ఆ మట్టిలోనే కలిసిపోయారు. ఆరునెల్లనాడు రామిరెడ్డి కుటుంబంతో సహా వున్నవూరు వదిలేసి బ్రతుకు తెరువుకోసం కోస్తా ప్రాంతానికొచ్చాడు. గుంటూరుజిల్లా రెడ్డిపాలెంలో ఓ మోతుబరిరైతు పంచ జేరి తలదాచుకొంటూ, ఆ రైతుకు చిన్నా పెద్దా పొలంపనులుచేసిపెట్టూ కాలాన్ని ఎలాగో వెళ్ళదీసుకొస్తున్నాడు. సంక్రాంతిపండుగ ముందునాడు పొలాన్ని చూస్తూన్న రామిరెడ్డికి తన గత జీవితం గుర్తొచ్చింది——

రామిరెడ్డిది అనంతపురంజిల్లా కోటిపల్లిగ్రామం. అతని ముందు ఏడుతరాలవాళ్లు ఆ గడ్డమీదేపుట్టి ఆ గడ్డలోనే కలిసిపోయారు. రామిరెడ్డి పెళ్ళయే నాటిదాకా బీదరైతుల్లోనే లెక్క. రెడ్డి భార్య సీతాలక్ష్మి కాపరానికొచ్చినదగ్గర్నుంచీ రామిరెడ్డి పట్టింది బంగారమై కలిసొచ్చింది.

సీతాలక్ష్మి కాపరానికొచ్చిన మూడోసంవత్సరంలో కొడుకుపుట్టాడు. ఆ సంవత్సరమే దొడ్లో వున్న కర్రావు కోడెదూడను పెట్టింది. ఇంట్లో పసివాడి తప్పటడుగులూ, దొడ్లో లేగదూడ చెంగనాలు. జీవితం తొణికిసలాడుతోంది. ఆ యేడే రామిరెడ్డికి ఓ ఐదుపుట్ల జొన్నలు అధికంగా పండాయి. ధాన్యపురాసుల్తో గాదెలునిండిపోయాయి. రెడ్డి పని మూడుపువ్వులూ ఆరుకాయలూగా వుంది.

తమ్ముడు చెప్నా రెడ్డిని పట్నం చదువుకుపంపించాడు రామిరెడ్డి. పెద్దవాడైపోతూన్న తండ్రి పాపిరెడ్డి కొడుకు బలవంతంమీద అరకకట్టడం మానేసి నీడపట్టున కూర్చొని యింటి పనులు చూట్టం మొదలుపెట్టాడు.

రామిరెడ్డిమాత్రం అహర్నిశలు పొలంలోనే వుండి పని చేసుకొంటున్నాడు. రెడ్డికి తన కష్టం అక్కరకొస్తోన్న కొద్దీ భూమిమీద మమకారం గౌరవం పెరిగిపోతూంది, రెడ్డి భూమినినమ్మాడు. నమ్మిన రెడ్డిని భూదేవి తన చల్లని పంటలచేత్తో సాకింది. సంపదలవడిలో పొదువుకొంది.

రామిరెడ్డి గ్రామస్థుల్లో తల్లో నాలికలా మెసులుకొనేవాడు. పదిమందిలోను "అవును" అనిపించుకొన్నాడు. తోటివాళ్ళను గౌరవించి గౌరవం తెచ్చుకొన్నాడు. ఒరులకష్టాలకు సానుభూతిచూపించాను. బాధలో వున్నవాళ్ళకు ఓ చేయి అందించటానికి వెనుకాడేవాడు కాదు. ప్రశాంతమైన గ్రామ వాతావరణంలో రైతు కుటుంబ సంప్రదాయాల పొరవడిలో జీవితనౌకను తోసుకు పోతున్నాడు. భార్య సీతాలక్ష్మి చుక్కాని పట్టింది.

రామిరెడ్డి భారీ విగ్రహం. ఎముకపుష్టికి తగ్గ కండలూ; కండల్లకి తేలిన నరాలు. విశాలమైన నుదురు. ఎత్తైన పొడుగాటి ముక్కు. లోతుగా వున్న కనిగుంటల్లో రాగివర్ణపుకళ్ళూ-నిండుచూపు. బలువైన కనురెప్పలూ, గుబురు నొసలూ, పైకి తేలిన చెంప యెముకలూను.

రామిరెడ్డిని ఒకసారి చూస్తేచాలు మళ్లీ మర్చిపోలేం. వందమందిలోవున్నా రెడ్డి యిట్టే కంట్లో పడ్తాడు. తలపై ముందుభాగం అంటకత్తిరేసిన జుట్టూ, సగం దగ్గర్నుంచీ పొడుగాటి జూలు; పొంకంగా వేసిన ముడి మెడమీద వాలిపోయి వుంటుంది. వెడల్పాటి చెవులు. ఎడంచెవుకున్న ఎర్రరాయిపోగు రామిరెడ్డి ముఖానికేదో తెలియని ఆకర్షణ యిస్తూంటుంది.

చామనచాయకు తగ్గ గట్టిఒళ్ళూ, విశాలమైన ఛాతీ రెడ్డికి నిండుతనాన్ని యిస్తూ వుంటయ్. కండలు తిరిగిన 'దండలూ, కాయలుకాచిన అరిచేతులూ, భూమికుంకే నడక; రామిరెడ్డి నిలువెల్లా రైతుబిడ్డ; తనువెల్లా కష్టజీవిలా వుంటాడు.

రామిరెడ్డిది నిర్మలహృదయం. కలుపుగోరుతనంగల రైతు. మంచితోనే మంచిని సాధించాలనే తత్వం.

రామిరెడ్డికి తగిన భార్య సీతాలక్ష్మి. భర్తతోటిదే లోకం. ఆయన ఆనందమే తన ఆనందం. ఆయన సుఖమే తన సుఖం అనుకునేది. పొలాన్నుంచి అలిసొచ్చిన భర్తకు అమృతాన్ని వర్షించేది. ఆహ్లాదాన్ని కలిగించేది. ఆమె హృదయం ఓ పచ్చని మైదానంలా వుండేది రెడ్డికి.

లక్ష్మి నేర్పుగా యింటి పనులన్నీ చూసుకొనేది. ఇంటినిగురించి బెంగ రెడ్డికి ఏనాడూలేదు. ముసలి మామ, వయసులోవున్న మరిదీ, వాళ్ల మనస్తత్వాల్ని అర్థంచేసుకొని మెలిగేది.

ఆమె యింట్లో తిరుగుతూంటే నిజంగా శ్రీలక్ష్మి తిరుగుతోన్నట్టే వుండేది రెడ్డికి. సీతాలక్ష్మిది దబ్బపండువంటి రంగూ, పలచని శరీరం, అంత పొడుగూ కాదు. అంత ఎత్తూ కాదు. కోల ముఖం. కోటేరేసినట్టు ముక్కూ. విశాలమైన గుండ్రటి కళ్ళూ, హృదయాన్ని పట్టుకొనే చూపులూ, అందాల్ని చిందించే వయసు వొంపులతో నిజంగా సీతాలక్ష్మి శ్రీ లక్ష్మిలా వుంటుంది.

చల్లని చూపూ, మెల్లనినడకా, మెత్తనిమాటా, స్నిగ్ధహృదయంగల సీతాలక్ష్మిని రామిరెడ్డి మనసారా ప్రేమించాడు.

కొత్త సంవత్సరం వచ్చింది. సీతాలక్ష్మి మళ్ళీ కడుపుతో వుంది.

ఆకాశంలో తొలకరి మబ్బులుపట్టి చల్లగాలి వీచింది. బసవన్నలు రంకెలువేశాయి. రైతులు అరకలుకట్టి మెట్ట సాగుదున్నారు. తొలకరి వానలు కురిసి భూమి పదునైంది. రామిరెడ్డి చేలో విత్తనాలు చల్లాడు. మొక్కలు పైకి వస్తూండగా జల్లువాన, మొక్కలు పెరిగి పైకొచ్చాక జడివానలూ కురిసినై. ఏపు గాలి, తీపి పంట. ధాన్యరాసుల్తో రామిరెడ్డి గాదెలు పండిపోయినై.

రంయిన మరో సంక్రాంతి వచ్చింది. ఇంటింటా పచ్చని తోరణాలూ, అలుకులూ ముగ్గులూ. ముంగిళ్ళలో రంగవల్లికలు. వాడవాడా సంబరం. వీధివీధి వుత్సవాలు గృహిణుల కళ్ళల్లో కాంతులూ, ఆశలూ. పసికందుల మనసుల్లో సంతోషం, రైతుల హృదయాల్లో శాంతి. ఏమూల చూసినా క్రాంతి, మధుర సంక్రాంతి. మకర సంక్రాంతి. రామిరెడ్డి ఆనంద వెల్లువలో మునిగిపోయాడు.

ఆ సంవత్సరం మళ్ళీ రామిరెడ్డికి పదమూడు పుట్లు ధాన్యం ఎక్కువగా పండింది. సీతాలక్ష్మికి ఆడపిల్ల పుట్టింది. దొడ్లోవున్న కర్రావు ఈసారి పెయ్యదూడను పెట్టింది.

ఓ శుభ ముహూర్తాన దంపతుల కూతురికి భాగ్యమ్మ అని పేరుపెట్టుకొన్నారు. భాగ్యమ్మ నిజంగా భాగ్యమ్మే! భాగ్యమ్మ పుట్టినదగ్గర్నుంచీ రామిరెడ్డి పని నిమ్మకుని రెత్తినట్టుంది. రెడ్డి అదృష్టం పడింది.

భాగ్యమ్మ పుట్టిన ఏడే రామిరెడ్డి కొత్త యింటికి పునాదులు తీయించాడు. పడమటి గోడకు పునాదివేస్తూండగా బంగారపు కణికలు దొరికినై! అదంతా తన కూతురు అదృష్టమే అనుకొన్నాడు రెడ్డి. దాంతో మరో ముప్పై ఎకరాలు కొనేశాడు. ఇప్పుడు దాదాపు ఏభై ఎకరాల పొలం, ఐదెకరాల సేద్యం, యిద్దరు జీతగాళ్ళూ. రామిరెడ్డి గ్రామంలో ముఖ్యుల్లోఒకడు.

భాగ్యమ్మకు మూడేళ్లు నిండినై. నత్తినత్తిగా మాటలు చెప్తోంది. కొడుకు బాలిరెడ్డికి పదో ఏడు వచ్చింది. ఆవు దూడకు పచ్చి పరకలు మేపుతున్నాడు. రామిరెడ్డి వప్పున తేలొచ్చిన కోడె దూడకు అర్రుచేశాడు. బలువుగా లాగుతోన్న యింటి ముసిలెద్దు, ఫుల్లెద్దును కొడికింద నుంచి తప్పించి గిత్తను పల్లెద్దుకు జత కలిపేడు.

కాని ఆ యేడు ప్రకృతి చిన్నచూపు చూసింది. ఆ తొలినీటి మబ్బులు లేవు. తొలకరి వానలులేవు. ఆ చల్లటి నీటిగాలి లేదు. ఆ కొత్త మట్టి కంపులులేవు. ఆకాశమంతా పొడిమబ్బులు. వడగాలి.

రైతులు ఆశగా మింటికేసి మబ్బుల్ని చూశారు. దీనంగా బీటలుతీసిన తమ భూమిల్ని చూసుకొన్నారు. పొడిగాలిని పెదవులతో తాకుతూ ఆశలతో కమ్ముకువస్తూ, అంతలోనే తేలిపోతున్న నీటి మబ్బులకేసి చూశారు.

రామిరెడ్డి ఆశలు అడియాశలయాయి. ప్రకృతి దేవత పగపట్టింది. వరుసగా ఒకటీ, రెండూ— మూడు సంవత్సరాలు అదే వడగాలీ, పొడి మబ్బులూ, అడియాశలూ, నిట్టూర్పులూను.

ఆకాశంలో తెల్లటి మబ్బులూ, ప్రజల హృదయాలు కారుచీకట్లో అలుముకుపోయినై. జనంలో జవంలేదు. మనుషుల్లో బలం వుడిగిపోయింది.

క్షామదేవత (విరుచుకుపడింది. మృత్యువు విలయనృత్యం సాగించింది. పైశాచికం వికటాట్టహాసం చేసింది.

చెరువులు ఎండిపోయినై. గాదెల్లో ధాన్యం ఖాళీఅయింది. గాదెలకింద పందికొక్కులు స్వేచ్ఛగా తిరుగుతున్నయ్. బావుల్లో నీళ్ళు వట్టిపోయినై. మనుషులకు అన్నంలేదు. నీరులేదు. పశువులకు మేతలేదు.

దాదాపు ముప్ఫైవేల చదరపుమైళ్ళ వైశాల్యం అంతా పొయ్యిమీది పెనంలా మాడిపోతూంది. అరవైలక్షల జనం నల్లుల్లా మాడి చస్తున్నారు. నూటపదిడిగ్రీల వేడి. అగ్నిగుండంలోని సమిధల్లా మనుషులూ, పశువులూ ఆహుతైపోతున్నారు. "అనాధులంతా, అభాగ్యులంతా అసహాయులంతా."

ఎక్కడా తిండిలేదు. గంజిలేదు. నీళ్ళులేవు. నేలంతా ఎండిపోయింది. కాలువలూ, చెరువులూ బావులూ ఎండిపోయినై. పంటలు మాడిపోయినై. చేలో చల్లిన విత్తుకూడాదక్కలేదు. చెట్లూచేమలూ మాడిపోయినై. అరణ్యాలుకూడా మాడిపోయినై. పచ్చటి బీళ్ళన్నీ గోధుమవన్నెకు తిరిగిపోయినై. సీమంతా ఓమండుటెడారి అయిపోయింది.

రామిరెడ్డి యింట్లో ఆఖరి పిడికెడు జొన్నలు అయిపోయినై. కుటుంబం అంతా, సీతాలక్ష్మి భద్రంగా దించివుంచిన చింతవిత్తులు తింటూ కొద్దిరోజులు గడిపారు. అవీ అయిపోయినై. పిల్లలిద్దరూ ఏరుకొస్తూన్న ఎండుటాకులూ చెట్టు బెరడులూ వుడకబెట్టుకు తింటున్నారు.

ఏనుగంటి రామిరెడ్డి పీనుగులా అయిపోయాడు. ముసలాడు పాపిరెడ్డి పొట్ట వెన్నుపూసకు అంటుకుపోయింది. పిల్లలకు పక్కటెముకలు బయటబడినై. సీతాలక్ష్మి అస్థిపంజరంలా అయిపోయింది. కళ్ళలోనే ప్రాణాలు.

దొడ్లో పశువులు జీర్ణకంకాళాలు అయిపోయినై. మేతలేదు. నీళ్ళులేవు. తలలు నేలకు ఆనిస్తోన్నాయి. నాలికలు చాచి ముట్టెలు మట్టిలో కుమ్ముతున్నాయి.

రామిరెడ్డి యింట్లో మృత్యుదేవత కాలు పెట్టింది. వరుసగా విరుచుకు తింటోంది. పెయ్యదూడ చనిపోయింది. చనిపోయిన దూడ తలను పటుక్కున కొరికింది నల్లావు. గోమాత సాధుత్వాన్ని మరిచిపోయింది. మానవుడిలోని దైవత్వం నశించింది. రాక్షసత్వం విజృంభించింది.

మగవాళ్ళు యిళ్లువదిలి పోతోన్నారు. స్త్రీలు వురులుపోసుకొని చనిపోతున్నారు. తల్లులు పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకొంటున్నారు. పిడికెడు జొన్నలూ-గుక్కెడు నీళ్ళకూ తల్లి బిడ్డను అమ్ముకొంటూంది. చిరుతపులులు అడవుల్లోంచి బయటికొచ్చి వూళ్ళమీదపడుతున్నాయి. అంటు వ్యాధులు అలుముకుపోతున్నాయి.

పీక్కుపోయిన డొక్కలూ, పొడారిన గొంతులూ, ఎండిపోయిన పెదవులూ, నోటికి దొరికిన దేన్నయినా-ఆకూ, అలం, గొడ్డూ, బిడ్డా-దేన్నైనా సరే ఆకలిమంట చల్లార్చుకోటానికి.

మానవత్వాన్ని అమ్ముకొన్నా గుక్కెడుగంజి దొరకటంలేదు. జీవరాసులు సర్వనాశనం ఐపోతోన్నాయి. తోలు ధరకు పశువుల్ని కసాయివాడికి అమ్మేస్తోన్నారు. కళేబరాలు గుట్టలు పడిపోతూన్నాయి. ఎముకలు రాసులు పడిపోతూన్నాయి. రాబందులూ, మనుషులూ పోటీ పడుతూన్నారు యెముకకు అంటుకొన్న మాంసపు ముక్కకోసం. తెగి పడిపోయిన తలలు అడుగుతూన్నాయి దీనికి కారణం ఏమని. నేలకురాలిన పుర్రెలు ప్రశ్నిస్తోన్నాయి ఆకాశంవంక చూసి! మొగ్గలోనే రాలిపోయిన శిశువుల శవాలు శపిస్తోన్నాయి! దేముడెక్కడ, పార్టీ లెక్కడ నాయకు లెక్కడ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం అక్కడక్కడా గంజి సత్రాలు తెరచి, కరువు పనులు మొదలుపెట్టింది. కోటిపల్లికి ఐదుమైళ్ళ దూరంలో రోడ్డుపని మొదలుపెట్టారు. మగవాళ్ళకు పదణాలూ, ఆడవాళ్ళకు అర్ధరూపాయి కూలి యిస్తున్నారు.

రామిరెడ్డి పనిలోకి వెళ్లాడు. పగలల్లా రాళ్లు పగలకొట్టున్నాడు సౌభాగ్యాన్ని మోసిన్న సీతాలక్ష్మి మట్టి తట్టలు మోస్తూంది.

రెండు వారాలు పనిచేయించుకొని రెండు రోజులకుమాత్రం కూలియిస్తూన్నాడు రోడ్డు కంట్రాక్టరు.

రామిరెడ్డి ఎముకల్లో మూలుగు కరిగిపోయింది. వెన్నెముక విరిగిపోయింది. సీతాలక్ష్మి ఎముకలు పెట్టి కుట్టినతోలు సంచిలా అయిపోయింది! కదిలేవోపిక లేదు. మెదిలేసత్తువలేదు. మనుషుల్లో జవంచచ్చిపోయింది. జీవంఆరిపోతోంది.

పాపిరెడ్డికి చూపుతగ్గిపోయింది. తడువుకుంటూ పోయి గంజిసత్రం దగ్గర నిలబడుతున్నాడు, అక్కడ రద్దీఎక్కువైపోయింది. ఒకరోజునకళ్ళు కనబడని ముసల్దోణ్ణి పక్కకుతోసేశారు. అక్కనుంచీ ముసలాడు మనవణ్ణి తోడుకుతీసుకు పోతున్నాడు.

ఆరోజుగంజిసత్రం ముందు అడావిడిగావుంది. మహానాయకుడెవరో వచ్చారట. గంజికూడారుచి చూసి చాలాబాగుందన్నాడట. రోజూ తను తాగేదియిలాగావుంటుందట. అయితేఆందులో కొంచెంపాలూ, పంచదారా, యిందులోకొంచెం నీళ్ళు, వుప్పూ— అంతేనట బేధం! వుప్పుగంజే ఆరోగ్యానికి మంచిదనికూడా శెలవిచ్చాడట!

ఆయనగారు అటువెళ్ళగానే సత్రంముందు రద్దీఎక్కువయింది. జనంతోసుకొని తొక్కుకొంటున్నారు. ఎ ము క ల గూ ళ్ళు బరుచుకొంటున్నాయి! ఆగంజికికూడా నోచుకొని కాళ్ళు విరచుకొని కిందపడిపోతున్నారు.

గంజికిపోయిన తాతా మనుమడూఎంతసేపటికీ తిరిగిరాకపోతే, రామిరెడ్డి గంజిసత్రం దగ్గిరకు వెళ్ళాడు.

ఆతోపిడీలో ముసలాడు వెనకపడిపోయాడు. కుర్రోడికి ఓగ్లాసెడుగంజి దొరికింది. మనుమడు తాతదగ్గరకు గంజిగిన్నె తీసికెళ్ళి కూర్చున్నాడు. ముసలాడు ఆత్రంగా గిన్నె నోటికక్కరుచుకొని అంతాతాగేస్తూంటే, బా లి రె డ్డి నాకునాకు, అంటూ గిన్నెపట్టుకుని లాగుతూ, ముసలాడిపైతలపడ్డాడు. ముసలాడు వొకచుక్కకూడా మిగల్చకుండా గంజంతా తాగేశాడు. గంజికోసం గుంజులాడుతూన్న తాతా మనుమణ్ణి చూసి రామిరెడ్డి కంపించిపోయాడు! "చూడు నాన్నా! తాత అంతా తాగేశాడు — వూఁ వూఁ" అని ఏడుస్తూ బాలిరెడ్డి తండ్రికాళ్లకు చుట్టుకున్నాడు.

తండ్రి గుండెలు తరుక్కుపోయాయి. రెడ్డి వూహకు అందని దృశ్యం! అయినా కళ్ళముందే జరిగింది.

రామిరెడ్డి కొడుకు చేతిలోవున్నగిన్నె తీసుకొని జనాన్ని తోసుకొంటూ గుంపులో జొరబడ్డాడు. వాలంటీర్లు జనాన్ని సర్ది "క్యూ"లో నుంచోబెట్టారు. ఒకవైపు ఆడవాళ్ళూ, రెండోవైపు మగవాళ్లూ క్యూలోనుంచొని ఒక్కొక్కరే గంజి తీసుకొంటున్నారు.

వాలంటీర్లు వొక్కొక్కళ్లకే గంజిపోసి పంపూతూన్నారు. ఎముకలు కుటిన తోలుసంచీల్లా అన్నార్తులు వరసల్లో కదిలిపోతున్నారు.

క్యూలో నిలబడ్డ రామిరెడ్డిని వెనకనుంచి "బాబుగారూ!" అని పిల్చారు. పిలుపువిని రెడ్డి వెనక్కు తిరిగి చూశాడు.

పెద్దపాలెగాడు నరిసింహులు. తూలిపోతూ యజమాన్ని చూసి అన్నాడు.

"దొరగారూ! మీరుకూడా యీ గంజినీళ్లకోసం వచ్చారా?"

రామిరెడ్డి అభిమానం దెబ్బతిన్నది. ఏమనాలో తెలియలేదు. నివురుగప్పిన నిప్పుపైన గాలివూదాడు నరిసింహులు. "మీరుకూడా—?" అన్నమాట రామిరెడ్డి పేగుల్ని తోడేసింది. ఏదో తెలియనిబాధ. ఆకటిబాధకంటే దారుణంగావుంది రెడ్డికి. రైతుకూ, పాలెగాడికీ మొదటిసారిగా తెలిసివుంటుంది. అందరి కడుపుల్లోవున్న ఆకలిబాధ ఒకటేనని. దానికి యజమానీ సేవకుడూ బేధంలేదు.

అయినా, రెడ్డికి ప్రాణంపోతూన్నా అభిమానం మాత్రం చావలేదు. అక్కడ్నుంచి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని ఎదురుగా తండ్రి తెచ్చే గంజికోసం కొండంత ఆశపెట్టుకొని నుంచొనివున్న కొడుకు కనిపించాడు. అలాగే క్యూలోనుంచొని ఒక్కొక్క అడుగేముందుకు జరుగుతున్నాడు.

అంతలోనే "బాబుగారూ బాబుగారూ!" అంటూ నరిసింహులు కళ్ళుతిరిగి కిందపడిపోయాడు. పడిపోయిన నరిసింహులు లేవదీసి తనముందు పట్టుకొని నుంచోబెట్టుకొన్నాడు రెడ్డి.

క్షుదార్తుల శకటం కదిలిపోతోంది! ముందున్న పాలెగాడికి గంజి దొరికింది. రామి

రెడ్డి వంతువచ్చింది. రెండుచేతుల్లో గిన్నె త్తి పట్టుకొన్నాడు. గంజిపోస్తోన్న వాలంటీరు పోయబోతూ టక్కున ఆగాడు. వెంటనే మరో యిద్దరు వాలంటీర్లు రామిరెడ్డిని రెక్కలు పట్టుకొని బయటకు నెట్టారు. పక్కన కూర్చొని వున్న అధికారి అన్నాడు.—"ఎద్దులావున్నావు. పని చేసుకోలేవూ? ఇక్కడ ముసలాళ్లకు ఆడాళ్లకు పిల్లలకూ మాత్రమే గంజిపోసేది."

రామిరెడ్డి హృదయం గాయపడింది. కళ్లలో రక్తపుజీరలు కదిలాయి. తోడు గాని ముసలాణ్ని తీసుకొని యింటిదారిపట్టాడు. ఆడవాళ్ల క్యూలో నుంచి సీతాలక్ష్మి గంజిగిన్నెతోవచ్చి వాళ్లను కలుసుకొంది.

అంతవరకూ రెడ్డిభార్యను గంజి సత్రం దగ్గరకు పంపలేదు. కాని ఆరోజు ఆమెభర్తకు తెలియకుండావచ్చింది. గంజిగిన్నెతో వస్తోన్న భార్యను చూసిన రెడ్డికి గాయంమీద సూదులు పొడిచినట్టయింది! లక్ష్మి భర్తకళ్లలోకి భయంగా జాలిగాచూసింది. కాని రెడ్డి ఆమెవంక చూడ లేదు. నలుగురూ మౌనంగా యింటికి నడిచారు.

మృత్యుదేవత జీవితంతో దోబూచులాడు తూంది! రెడ్డిభార్యతో యింట్లో కాలుపెట్టేసరికి తమ నల్లకుక్క భాగ్యమ్మకాలు పట్టుకొని యీడ్చుకుపోతూ ఎదురైంది. తల్లిగుండెలు బాదుకొంటూ బిడ్డపైపడి పోయింది. రెడ్డి లోతుకుపోయిన కుక్కపొట్టలో వొక్క తన్ను తన్నేడు. కుక్క ఆరుస్తో, విలవిలాతన్నుకుంటూ అక్కడేపడిపోయింది. అది ఆ ఇంట్లోనే పుట్టింది. అక్కడే పెరిగింది. అక్కడే ఇంటిపై కాకివాల కుండా కాపలా కాచింది. లక్ష్మిచేతి అన్నంతిని బతికింది. ఆ లక్ష్మిబిడ్డనే తినబోయింది. అయితే ఏం? ఆకలి!

రెడ్డి ఏచేతుల్తో పెంచాడో ఆచేతుల్తోనే దాన్ని చంపాడు. అది చిన్నప్పట్నించీ ఏకాళ్లను విశ్వాసంతో నాకిందో ఆకాళ్లేతన్నాయి. ఇది ఎవరితప్పు? చనిపోయిన కుక్కదా? బతికున్న రెడ్డిదా?

అలా కుక్కలాక్కుపోతూన్నా భాగ్యమ్మ ఏడవలేదు. పిల్లలు ఏడవటం మర్చిపోయారు. భాగ్యమ్మనోట మాటలేదు. పలుకూలేదు. వూరికే తండ్రివైపు చూసేది. తండ్రికూతురు చూపుల్లో చూడలేక కిటికీలోగుండా పశువులదొడ్లోకి చూసేవాడు పిల్లకిచ్చిగా చూస్తూ పెరాలు తడుపుకొనేది. తల్లినోటికందించినగంజి మింగుడుపడలేదు. మూడు రోజులపాటు అలా వెర్రిగా చూసి నాలుగో రోజు కళ్లుమూసుకొంది భాగ్యమ్మ. లక్ష్మి భర్త కళ్ళల్లోకి చూసింది. రెడ్డి వాకిట్లోగుండా బయటికి చూశాడు. మాడిపోయిన చెట్లు; నెర్రెలు విచ్చిన పొలాలు; ఎర్రదుమ్ముకమ్మిన్న రోడ్డూ; దూరాన కొండల నునుపు.

కోటిపల్లిగ్రామప్రాంతాల్లో శవాలకు భద్రత లేకుండాపోయింది. నక్కలూ, తోడేళ్ళూ రాబందులూ విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మనుషులూ మృగాలూ ఒకటేవేట! కళేబరాలవేట. బొమికల కంటిపెట్టుకున్న మాంసంకోసం. మనుషులకూ జంతువులకూ అస్థిపంజరాలే ఆస్తి! ఓ పక్కన శవాల్ని మనుషులు పాతేస్తూంటే మరో ప్రక్క తోడేళ్లు బయటికి లాగుతున్నాయి.

తన భాగ్యమ్మను, చిట్టితల్లిని కుక్కలు బతికుండగానే లాగిసై. బతికుండగా భాగ్యమ్మను కుక్కల దాడి నుంచి కాపాడలేకపోయాడు. భాగ్యమ్మ శవాన్నైనా భద్రంగా కాపాడాలి. రామిరెడ్డి తన కూతురు శవాన్ని యింటివెనక పడమటి గోడపక్కనేపాతి పెట్టాడు. అక్కడే రామిరెడ్డికి భాగ్యమ్మ పుట్టిన సంవత్సరం బంగారం దొరికింది. ఆ బంగారపుమట్టిలోనే భాగ్యమ్మను దాచిపెట్టాడు. బంగారం తీసినచేతుల్తోనే తన బంగారుతల్లిని పూడ్చిపెట్టింది సీతాలక్ష్మి.

ఇంట్లో ఏడుపులు లేవు. పెడబొబ్బలూ లేవు. అంతా చీకటి. నిశ్శబ్దం. వెలుగునీడల్లో జీవితం మృత్యువు దాగుడుమూతలు. బ్రతుకూ చావుకూమధ్య దూరంలేదు. రెండూ వొరుచుకుని నడుస్తున్నాయి. రెంటికీ కనపడుతూన్న భేదం అల్లా కదిలే అస్థిపంజరాలు, కదలని అస్థిపంజరాలు; చరం, అచరం; చలనం, అచలనం; అంతే.

ఆ రాత్రి అరుగుమీద మోకాళ్ళసందున తల పెట్టుకొనికూర్చొన్న భర్తను సమీపించి అంది లక్ష్మి.

"మన పక్కింటి కొండలరెడ్డి పోయాడట."

"ఎక్కడికి?"

"తూర్పుకు. గోస్తాజిల్లాల్లో అన్నం దొరుకుతుందట!"

"హూఁ" నిట్టూర్చాడు రెడ్డి.

"మనంకూడా పోదాం!"

"ఎక్కడికి?"

"అక్కడికే!"

"ఇదంతా వదిలపెట్టా? మనవూరూ, మన పొలాలూ, మన యిల్లూ వదిలిపెట్టి ఎక్కడికి పోతాం?"

"మన భాగ్యం నుట్టుబుపోయింది! మన చిట్టి తల్లి మన్నయిపోయింది! మన ఆశలు అడుగంటి పోయినై. యింక మనకిక్కడేముంది?" కళ్ళు తుడుచుకుంటూ అంది లక్ష్మి.

"మన చిట్టితల్లితో పాటే మనం కూడా యిక్కడే..." ముఖాన్ని రెండుచేతుల్లో కప్పుకొంటూ అన్నాడు రామిరెడ్డి.

"వీడికోసం? మన మిగిలిన జీవితాశ! వీడికోసమైనా మనం యిక్కణ్ణుంచి కదలాలి." తన వడిలోవున్న బాలిరెడ్డిని భర్తచేతుల్లోకి అందిస్తూ అంది లక్ష్మి.

ఆరునెలలక్రితం పట్నంలో చదువు చాలించి యింటికి తిరిగొచ్చిన చెన్నారెడ్డి అన్న రామిరెడ్డి ఎంతచెప్పినా వినకుండా ఒక ధాన్యందోపిడీలో పాల్గొని పోలీసులకు పట్టాడు. చెన్నారెడ్డికి ఆరు నెల్ల శిక్షపడి జైలుకుపోయాడు. ముసలాడు పాపి రెడ్డి చావుబతుకుల పెనుగులాటలోవున్నాడు.

రామిరెడ్డి కోస్తాజిల్లాలకు వెళదామా, లేదా అన్న మదనలోపడిపోయాడు- తన పొలాలు, తన వూరూ, తన యిల్లూ, తనవాళ్లూ, తనగొడ్లూ ఎలా వదలివెళ్ళడం?ఓపక్కన వాటిపై మమతా; మరోపక్కని దూరపు గొండల నునుపూ; అన్నం దొరుకుతూందన్న ఆశలూ.

భాగ్యమ్మ చనిపోయిన మూడోరోజున భర్తను పిలిచి చెప్పింది లక్ష్మి.

"కృష్ణారెడ్డిగారి పెద్దపిల్లవాడు కనిపించటం లేదట!"

"ఏం అయాడు?"

"ఏమోమరి? ఎవరో ఎత్తుకుపోయినట్టు చెప్పుకుంటున్నారు." బాలిరెడ్డిని ఎండిపోయిన గుండెలకు హత్తుకుని ఏడ్చింది.

"నేనిక్కడ యిక ఓ క్షణం కూడా వుండలేను! నాబిడ్డను తీసుకొని ఎటయినా పోతాను" అంటూ గిర్రున తిరిగి యింట్లోకి వెళ్ళింది లక్ష్మి.

"సరే! అయితే సామాను సర్దు రేపే వెళ్దాం!" అంటూ రామిరెడ్డి లక్ష్మి వెనకే బాలిరెడ్డిని తీసుకొని యింట్లోకి పోయాడు.

కర్రావునూ, ఇంటి పుల్లెద్దునూ మినహా మిగతా పశువుల్ని తోలుధరకు అమ్మి ప్రయాణానికి సిద్ధమయారు రామిరెడ్డి కుటుంబం. కావలసిన సామాను రెండుమూటల్లో కట్టి సిద్ధంచేసింది లక్ష్మి. తలుపుదగ్గరగా వేసవచ్చి భర్తపక్కనే నుంచొని కడసారిగా, దిగులుగా యింటివైపు చూసుకొంది లక్ష్మి. రెడ్డి ముసలి తండ్రీ, భార్యా, కొడుకుతో యిల్లువదిలిపోటానికి ప్రయాణమైనాడు. రామి రెడ్డి దొడ్లోకిపోయి ఒక్క చిక్కిపోయిన బసవన్నను పుల్లెద్దుమూపును గోముగా నిమిరి, సాగాడు. సీతాలక్ష్మి గోమాతకు-కర్రావుకు-దణ్ణం పెట్టి ముఖంనిమిరి భర్తవెనకే కొడుకును తీసుకొని సాగింది. కళ్ళు కనపడని పాపిరెడ్డి కొడుకు భుజంపట్టుకొని కదిలాడు.

సాగిపోతోన్న రెడ్డినిచూసి పుల్లెద్దు కాలుతో నేలదువ్వి మోరపైకెత్తి ముందుకు పడిపోయింది! కర్రావు బెదురుగా, దిగులుగా పడిపోయిన పుల్లెద్దునూ ఇల్లు వదిలిపోతోన్న రైతు కుటుంబాన్నీ, చూసింది.

ఎలుకలు తవ్వేసిన ధాన్యపుగాదెలూ, బూజు పట్టిన నాగలీ, వంకెకు తగిలించివున్న మేడీ, దుమ్ముకొట్టుకొన్న బండీ, కూలి పోబోతూన్న సావిడీ, కప్పు రాలుతూన్న యిల్లూ, ఎద్దులు మేత మేసిన కాళీగాళ్లు, ఎడకుపగిలిన కుడితితొట్లూ, పగిలి నెర్రలిచ్చిన ప్రహరీగోడలూ, మౌనంగా, దీనంగా, దిగులుగా పుట్టెడు విషాదంతో కడుపు చేతపట్టుకొని పయనమైపోతూన్న రెడ్డికుటుంబానికి బాధతో మూలుగుతూ వీడ్కోలనిచ్చాయి.

రామిరెడ్డి కుటుంబం కోటిపల్ల పొలిమేరల బయటికొచ్చింది.

దుమ్ము లేస్తూన్న డొంకలూ, మట్టి కప్పుకుపోయిన దోవలూ, ఎండిపోయిన చింతతోపూ, నెర్రలిచ్చిన చెరువూ, బద్దలైన బండరాళ్లు బీటలు వారిన పంటభూములూ, మూగగా మౌనంగా రామిరెడ్డిని సాగనంపాయి. దూరాన కృష్ణవేణి తల్లి బిడ్డల బాధను ఘోషిస్తూ పొంగి పొరలి సముద్రగర్భంలో కలిసిపోతూంది. రాజుల్ని గన్న రత్నగర్భ పొతికడుపులో బాకు గుచ్చుకొంది!

మహాప్రస్థానం. క్షుధార్తులు పుట్టిపెట్టిన గడ్డను వదలిపోతూన్నారు. పాపిరెడ్డి, రామిరెడ్డి, బాలిరెడ్డి, మూడుతరాలవాళ్ళూ పొట్ట చేతపట్టుకొనివున్న వూరు వదిలిపోతోన్నారు.

కోటిపల్లికి యిరవైనాలుగుమైళ్ళ దూరంలో కాని రైల్వేస్టేషన్ లేదు. ఆ మండు టెడారిలో, ఎర్రగుమ్మ లేస్తూన్న రోడ్డుమీద తూలిపోతూన్న తండ్రిని ఒక చేత్తో కొడుకు చెయ్యపుచ్చుకొని నడుస్తూన్న భార్యను మరోచేత్తో ఆసరాని ఏదో తెలియని ఆశతో రామిరెడ్డి ముందుకు సాగిపోయాడు.

స్టేషన్ యింకా మూడుమైళ్ళు వుందనగా ముసలాడు ఓ చెట్టుకింద ఆకలిబాధనుంచి విముక్తుడయి శాశ్వతంగా కళ్లుమూశాడు.

బ్రతికిచెడ్డ పాపిరెడ్డి వూరుకాని వూళ్ళో ఏదో ఓ చెట్టుకింద మట్టయిపోయాడు. "పుట్టి పెరిగిన గడ్డమీద వొరికిపోయే రాత" లేకపోయింది పాపం పాపిరెడ్డికి.

తండ్రి శవాన్ని లోతుగా పాతిపెట్టే శక్తి కూడా లేకపోయింది రామిరెడ్డిచేతుల్లో. పాపిరెడ్డి శవంమీద యింత మట్టి కప్పికొడుతూ, కోడలూ మనుమడూ ముందు సాగిపోయారు.

రోడ్లన్నీ రాయలసీమనుండి కోస్తాజిల్లాలకు వెళ్ళిపోతూన్న కరువు బాధితులతో నిండిపోయింది. రైళ్ళన్నీ అన్నార్తుల కుటుంబాలతో కిటకిట లాడిపోతూనయ్. రేపు అదృష్టం కొద్దీ తినబోయే పట్టెడు అన్నంమీద కొండంత ఆశతో కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని క్షుధాపీడితులు సర్కారు జిల్లాలకు తరలిపోతోన్నారు.

గుంటూరుస్టేషన్ బయట రైళ్ళన్నీ ఆపి అధికారులు టికెట్ లేని ప్రయాణీకుల్ని దించేస్తోన్నారు రామిరెడ్డి కుటుంబంవచ్చిన బండి మునిమాపువేళ గుంటూరు చేరుకొంది, ఔటరు సిగ్నల్ దగ్గర బండి ఆగుతూండగానే వాకిట్లో నిలబడి నీళ్ళకోసం ఆత్రంగా చూస్తూన్న బాలిరెడ్డి బండిదిగి ఇంజను నీళ్లుపోసుకొంటూన్న కొళాయి దగ్గిర పరుగెత్తాడు. రామిరెడ్డి కొడుకుకోసం పెట్టెంతా గాలించి బండి దిగపోయే సమయానికి బండి సాగింది.

తర్వాత తప్పిపోయిన కుర్రాడికోసం తల్లిదండ్రులు ఆ ప్రాంతంఅంతా వెదికారు. ఎక్కడా బాలిరెడ్డి ఆచూకి తెలియలేదు. కన్నతండ్రి గుండెల్లో బాకు గుచ్చిపోయాడు బాలిరెడ్డి. కన్నతల్లి కడుపులో చిచ్చుపెట్టి మరీ పోయాడు బాలిరెడ్డి.

రామిరెడ్డి జీవన జ్యోతి రెపరెప లాడింది. ఆశాజ్యోతి కొడారి పోతోంది. మిగిలిన ఒకే ఒక ఆశకూడా దూరమైపోయింది.

దంపతులిద్దరూ రాత్రిళ్లు యిళ్ళముందూ పగలు హోటళ్ళముందూ అడుక్కొని దొరికింది తింటూ, ఊరువూరూ తిరుగుతూ ఒక నెలరోజుల పాటు ఆప్రాంతం అంతాగాలించారు బిడ్డకోసం.

బాలిరెడ్డి వయసులోవున్న పిల్లలు దూరంగా ఎవరు కన్పించినా, ఆశతోపోయి చూస్తూ అంతలోనే నిరాశచెందుతూ కాళ్లు బలపాలు కట్టేట్టు తిరిగి తిరిగి చివరకు రెడ్డిపాలెం గ్రామం చేరారు.

రెడ్డిపాలెంలో మోతుబరి రైతు పంచనచేరి గొడ్ల చావిట్లో వండుకుతింటూ, ఎప్పటికయినా తమకు దూరమైన ఆశాజ్యోతి, తమ బిడ్డ బాలిరెడ్డి తమ దగ్గరకు రాకపోతాడా అన్న ఆశతో శేషజీవితాన్ని బలువుగా యీడుస్తూ రోజులు దొల్లిస్తున్నారు రెడ్డిదంపతులు.

ఆరునెలలు గడిచిపోయినయ్. రాయలసీమలో వర్షాలు కురిసినాయి. ఆ వార్త విని రామిరెడ్డి పొందిన ఆనందం చెప్పటానికి తరంగాదు. మాడిపోయిన ఆశలు చిగురించుతూనే మళ్ళా వాడిపోయినయ్. బాలిరెడ్డి సంగతి యింతవరకూ అంతు తెలియలేదు. రానురాను తల్లి హృదయంలో దిగులుగూడు కట్టుకుపోతోంది.

ఓరాత్రి రెడ్డి భార్యతో అన్నాడు.

"మనదేశంలో వర్షాలు కురుస్తోయన్నయంట! ఇక మనూరుపోదాం."

"బాలిరెడ్డి లేకుండా ఎక్కడికీ పోవటం? నాబిడ్డ కళ్ళబడేదాకా నేనిక్కడినుంచికదలను."

మళ్ళీ రామిరెడ్డి మదనలోపడ్డాడు. తనదేశం తనవూరూ, తనయిల్లూ, తన భూములూ, తన నాగలీ ఎలుగెత్తి పిలుస్తున్నాయి. తన రాకకోసం ఎగురుచూస్తున్నాయి. అవన్నీ వదిలి కానివూళ్ళో పరాయి కొంపల్లో, లోకుల భూముల్లో ఎంతకాలం వూడిగం? యింకెంతకాలం ఈ బానిసత్వం, యీ నీచపు బతుకూను; నికృష్టజీవితం ఎంతకాలం భరించగలడు?

తన సీమలోని ప్రతి చెట్టూ, ప్రతి రాయీ, ప్రతిగడ్డా ఆశలు చూపి ఆహ్వానిస్తోన్నాయి. ముందుకు పిలుస్తున్నాయి. ఏనాటికైనా బిడ్డ దొరుకుతాడన్న ఆశ వెనక్కులాగుతోంది. ఇలా ఆశా, నిరాశల్లోపడి గింజిరులాడుతూ సంక్రాంతి పండుగ ముందురోజునాడు తూరుపొలాన్నించి తిరిగొస్తూన్న రామిరెడ్డి కుడికాలు పట్టుతప్పి గట్టుమీద ప్రక్కకు జారింది.

పంటకాలువ దాటి రోడ్డెక్కాడు రామిరెడ్డి. ఊళ్ళోనుంచి భోగిమంటల వెలుగులు కనపడుతూన్నాయి. వూరువూరూ వుత్సాహంలో మునిగిపోయింది. రావిచెట్టుకింద చేరి రైతులు ఆ యేడు ఎవరికెలా పండినదో, పంటల్నిగురించి మాటాడుకుంటున్నారు. అరుబయటివాకిళ్లల్లో చేరి ఆడవాళ్ళు తెల్లారి లేచి చేయాల్సిన పిండి వంటల్నిగురించి ముచ్చట్లు చేస్తున్నారు. వయసులో వున్న ఆడపిల్లలు అరుగులమీదచేరి తెల్లవారుజామున లేచి వేయాల్సిన ముగ్గుల్నిగురించి ఆలోచిస్తున్నారు. పసివాళ్లు కేరింతలుకొట్టూ ఆడుకొంటున్నారు. రామిరెడ్డి బరువైనహృదయంతో పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ యింటికిచేరాడు.

భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చొన్న లక్ష్మి రెడ్డి రాగానే, గోనెపట్టా పరిచి కంచంలో అన్నంపెట్టి, తనూ పెట్టుకొంది.

రామిరెడ్డికి అన్నం సహించలేదు. మజ్జిగన్నం కలుపుతూ వదిలివేసిపోయి కుక్కి మంచానికి అడ్డంపడ్డాడు. లక్ష్మి తింటూన్న పళ్ళెంలో నీళ్లు పోసి యీతచాప పరుచుకొంది.

"ఇక నేనిక్కడ ఓ క్షణం కూడా వుండ లేను!" మంచంలో పక్కకు తిరుగుతో అన్నాడు రెడ్డి. కుక్కిమంచం కిర్రుపెట్టింది. లక్ష్మి యీత చాపమీద అటూయిటూ మసిలింది.

ఆ రాత్రి లక్ష్మికి కొడుకునిగురించీ, రెడ్డికి తన వూరునిగురించీ పీడకలలతోనూ, సుఖ స్వప్నాలతోనూ గడిచిపోయింది.

మకరసంక్రాంతి మందహాసంతో కాలుపెట్టింది. తొలికోడికూసింది. తెలతెలవారుతోంది. పిట్టలు కిచుకిచుమంటున్నాయి. గాఢంగా కమ్ముకున్న చీకట్లు తేలిపోతున్నాయి. కాకులు గూళ్ళలోంచి లేచి కావుకావు మంటూ యిళ్ళమీద వాలుతున్నాయి.

జీతగాళ్ళు లేచి, గొడ్లదగ్గర బాగుచేసి కుడితి పెట్టి మేతలేస్తున్నారు. ఇంటి కోడళ్ళు లేచి కవ్వం తిప్పుతూ కృష్ణలీలలు పాడుతున్నారు. ఆడబిడ్డలు అప్పుడే లేచి ఆవరిస్తో వదినలతో సరసాలాడుతున్నారు. పల్లెపడుచులు పాలు పితుకుతూంటే అత్తగారు కోడళ్ళమీద, పని పాటలుచేసేవాళ్ళమీద పెత్తనాలు చెలాయిస్తోంది.

మంచు తెరలను తోసుకొని వీస్తూన్న చల్లగాలికి యిళ్ళల్లో కట్టిన కొత్త వరికంకులు వూగుతోన్నాయి. వూగుతూన్న కంకులపై పిచ్చికలు వాలుతోన్నాయి.

ఉదయభానుడు అరుణ కిరణాల్తో రెడ్డిపాలేన్ని ముంచెత్తుతోన్నాడు. భూదేవి రంగవల్లికలతో అలంకరించుకొని మురిసిపోతోంది.

నేలంతా తెల్లటిముగ్గులు. ముగ్గులమధ్య పెట్టిన గొబ్బెమ్మల తల్లోని బంతిపూవులు రాగకాంతికి తలలు వంచుతున్నాయి. చామంతీలు అరుణకాంతులకు సిగ్గుపడుతున్నాయి.

పాలెంలో ఆనందం పందిరివేసింది. సంతోషం వెల్లివిరిసింది. అంతా కోలాహలం. గ్రామస్థులు హడావుడిగా తిరుగుతోన్నారు. అందరిలోనూ ఒకటే కనపడుతుంది. నిర్మల హృదయాలు. తీర్చిన దిద్దిన రూపురేఖలూ కళ్ళల్లో కాంతులు. అందరి ముఖాల్లోనూ ఒకటే కళ. జీవనకళ వుట్టిపడుతోంది ఆ రోజు.

చుటుపక్కల పల్లెలనుంచి బీదవాళ్ళు జోలెలు కట్టుకొని గ్రామంలోకి బిలబిలా పరుగెత్తుకొస్తున్నారు. చాకలీ, మంగలీ, మొదలైన పనిపాటలవాళ్ళు గోతాలు బుజానవేసుకొని రైతుల యిళ్ళకు పరుగులుతీస్తూన్నారు. హరిదాసులూ, దాసర్లూ బుర్రకథవాళ్ళు, చెంచువాళ్ళు వీధుల వెంట పాడుకొంటూ బయలుదేరారు.

రెడ్డిపాలెంలోని రైతులంతా బలిచక్రవర్తి వారసత్వాన్ని నిలబెట్టుకొస్తున్నారు. కలవాళ్లందరూ ఆసక్తితో పండుగనాడు శక్తికొలదీ ధాన్యం దానంచేస్తూ వుంటారు. రెడ్డిపాలేనికి దాదాపు ఆ చుట్టుపట్ల పదిగ్రామాలన్నించి బిచ్చగాళ్ళే వస్తారు ఆ రోజున దోసిళ్ళతో పెట్టాల్సిన వాళ్ళకు దోసిళ్ళతోనూ, చేటలతో పెట్టాల్సిన వాళ్ళకు చేటలతోనూ, గంపలతో పెట్టాల్సిన

వాళ్ళకు గంపలతోనూ వడ్లు పెడుతూ, పిల్లల చేతా, భార్యలచేతా పెట్టిస్తూ, రైతులు సంతృప్తి పడుతూన్నారు.

రామిరెడ్డి ఆ రోజున అలస్యంగా లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకొంటూ "ఇదిగో! ఎక్కడ?" అంటూ లక్ష్మిని పిలిచాడు. లక్ష్మి యింట్లోలేదు. పొద్దున్నేలేచి బయటికెళ్ళింది. రామిరెడ్డి చావిటి గడపమీద కూర్చుని, వీధుల్లో జరుగుతూన్న సంబరాన్ని. కోలాహలాన్నీ చూస్తూ, పుట్టిన ఏడు తను సంక్రాంతి పండుగ ఎంతగొప్పెత్తుగా చేసిందీ తలచుకొంటూన్నాడు.

"పండగ దొరా? పండగ. సంకురాత్తిరి పండుగ! మా గొప్పగా పెట్టించాలి! గొప్ప పెబువులు!" పదిమంది బిచ్చగాళ్ళ గుంపు ఒకర్నొకరు తోసుకొంటూ జోలెలు ముందుకు చాచి రామిరెడ్డి ముందు నిలబడ్డారు.

రామిరెడ్డి కళ్ళచుట్టూ తిరిగిన కన్నీళ్లనుచూసి బిచ్చగాళ్లు అలా కొండంత ఆశతోవచ్చి, నిరాశగా వుసూరుమంటూ తిరిగిపోతూంటే రామిరెడ్డి చంపలమీదగా కన్నీటిచుక్కలు రాలి గడప మెట్లపై పడినై.

అంతలోనే, ఆ యిల్లూ యీ యిల్లూ తిరిగి బిచ్చమెత్తి తెచ్చిన వడ్లగంప నెత్తిన పెట్టుకొని సీతాలక్ష్మి యింటికొచ్చింది. వడ్లగంప దించుతూన్న లక్ష్మినిచూసిన రామిరెడ్డికడుపులో రంపపుకోత జరిగుతూన్నట్టు బాధపడ్డాడు.

"గంపలకొద్దీ ధాన్యం పెట్టిన చేతుల్తోనే సీతాలక్ష్మి బిచ్చమెత్తింది. భర్త వ్యధను గమనించిన లక్ష్మి వడ్లగంపదించి దిగులుగా భర్తపక్కనే కూర్చొంది.

మళ్ళీ మరోబిచ్చగాళ్ళగుంపు వచ్చిపడింది. రెడ్డిదంపతుల వాలకాన్ని చూసి వుసూరుమంటూ తిరిగిపోతూన్నారు. తిరిగిపోతూన్న బిచ్చగాళ్ళను వెనక్కుపిలిచి లక్ష్మి, రెడ్డిముందు వడ్లగంపనుపెట్టి భర్తకళ్ళలోకి చూసింది.

ఆమె కళ్ళలో ఏ మెరుపుకనిపించిందో రామిరెడ్డి రక్తంలో బలి, శిబిచక్రవర్తుల దాతృత్వం, దీనాకర్ణుని త్యాగనిరతీ ప్రవహించింది.

దోసిలితో ధాన్యంతీసి బిచ్చగాళ్ళకువేశాడు బిచ్చగాళ్ళగుంపు పెద్దదైపోతోంది. బిలబిలా అరుచుకొంటూ పరుగెత్తుకొస్తూన్నారు. తోసుకు వస్తోన్న బిచ్చగాళ్ళనుచూసి రామిరెడ్డి వుద్వేగంతో లక్ష్మి రెండుచేతులూ తను పట్టుకొని ఆమెచేత బిచ్చగాళ్ళకు వడ్లుపెట్టిస్తున్నాడు.

జోలిపట్టి బిచ్చం అందుకొంటూన్న పదేళ్లపసివాడు "అమ్మా!" అంటూ సీతాలక్ష్మి వడిలో వాలిపోయాడు.

"అయ్యో! నాతండ్రీ!" అంటూ లక్ష్మి కుర్రాణ్ని రొమ్ముకు గాంఢంగావత్తుకొంది.

రామిరెడ్డి లక్ష్మిచుట్టూ చేతులువేసి, తల్లి హృదయానికి హత్తుకుపోయిన కొడుకును తన ఛాతీకి దగ్గరగా తీసుకొన్నాడు.

బాలిరెడ్డి వెనకే జోలిపట్టుకొని నిలబడ్డవో కుంటివాడికి ఆదృశ్యం చూసేసరికి కళ్లుపులకిరించింది. కళ్లనుంచి ఆనందబాష్పాలు రాలినయ్.

కళ్లుతుడుచుకొంటూ కుంటివాడు చెప్పాడు రెడ్డికి తను రైల్లో ఆడుక్కొంటూండగా బాలిరెడ్డి దొరికిన సంగతీ; తర్వాత ఎలా పెంచిందీను. పండక్కు గ్రామాల్లో వడ్లుదండిగా దొరుకు తయని, ఆచుట్టుపక్క గ్రామాలుతిరిగి ఆరోజుకు రెడ్డిపాలెంచేరినట్టూ చెప్పాడు.

ఆ మకర సంక్రాంతి రామిరెడ్డికి ఆనంద సంక్రాంతి ఐంది. ఆ మధుర సంక్రాంతినాడే. రామిరెడ్డి ఆశలు చిగురించాయి. జీవనరేఖలు ప్రకాశించాయి.

ఆనాటిసాయంత్రమే లక్ష్మిరెడ్డి దంపతులు తిరిగొచ్చిన ఆశలతో—బాలిరెడ్డితో తమ వూరుకు బయలుదేరారు.

పశ్చిమదిక్కున, కొండలచాటుకు పోతున్న సూర్యుని ఎర్రటికాంతులు నురుపై పడుతూండే నిండు ఆశలతో రామిరెడ్డి బలిచక్రవర్తిలా రంగపల్లికలను దాటుకొంటూ, భార్యాపుత్రుడితో పుట్టి పెరిగి నజీవగడ్డకు— జన్మభూమికి—రత్నగర్భ రాయలసీమకు పయనమై పోయాడు.

